వైరివాడి తెలివి

బి. రాజేశ్వరి

చటుక్కున కళ్ళు తెరిచింది సుస్మిత. వాతావరణంలో ఏదో భేదం వచ్చినట్టనిపించింది. కళ్ళు బాగా విచ్చుకుని చూసింది. అది తన పడకగది కాదు! అలాగే ఉన్న మరో పడక గది.

సుస్మిత గుండె ఒక్క క్షణం ఆగి కొట్టుకుంది. రాత్రి తల్లితో బాటు తమ ఇంట్లో తన పడకగదిలో పడుకొంది. కాని ఇప్పుడు తెల్లారి లేచేసరికి మరో ఇంట్లో మరో గదిలో వుంది. ఇదెలా సాధ్యం?

తను కల కనటం లేదుకదా అనుకున్నదో క్షణం. గిల్లి చూసుకుంది. 'అబ్బ' అనుకుంది ఎర్రగా కందిన స్థలం చూసుకుని.

కల కాదు, నిజమే! చుట్టూ పరికించి చూసింది. అలారం టైంపీస్ టేబిల్ మీద ఉంది. కాని అది తమ గదిలో వుండే టైంపీస్ కాదు!

ఉదయం ఆరుగంటల పదినిమిషాలయింది అప్పటికి.

చీకటిపోయి పూర్తిగా వెలుగు వచ్చేసింది.

సుస్మిత గుండె వేగంగా కొట్టుకుంటోంది భయంతో. టెన్షన్‌తో అణువణువూ కంపించిపోతోంది. ఏం జరిగిందో అర్థంకావటంలేదు. తను నిద్రపోతుండగా యెవరో ఎత్తుకొచ్చి మరోచోట మరో పక్కమీద పడుకోబెట్టారు. వేరే పక్కమీద పడుకుని ఉన్నానన్న ఆలోచన రాగానే ఆమె వెన్నున జరజర ఏదో పాకి నట్టనిపించింది.

చటుక్కున లేచి పక్కనున్న పేంకుర్చీలో కూచుంది. నిద్రలో ఉండగా తనకేం కాలేదు, నయమే! భగవంతుడికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది. ఎలాంటి ఆపద నెదుర్కోవాలో, ఎలా ఇక్కడినుంచి బయట పడాలో ఆమెకర్థం కాలేదు. కూర్చుని యెంతోసేపు ఉండలేకపోయింది.

లేచి నించుంది. దిగజారిపోతున్న ధైర్యాన్ని కూడ గట్టుకోవటానికి శాయశక్తులా ప్రయత్నించింది. గుండె వేగంగా కొట్టుకోవటం తగ్గలేదు. అరచేతులు, అరికాళ్ళు చిరు చెమటతో తడిసిపోయాయి. నాలుక పొడారిపోయి నట్టనిపించింది. మనసంతా, ఏదో ప్రమాదం ముంచుకు రాబోతున్నట్టు అనిపిస్తోంది.

ఆమెకి ఏమీ అర్థంకావటంలేదు. రాత్రి పదిగంటలకు తన తల్లి పక్క పక్క మంచాల మీద పడుకున్నారు. తను ఓ అరగంటసేపు ఏదో మేగజైన్సు తిరగేస్తూ అలాగే యెప్పుడో నిద్రలోకి జారిపోయింది. ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు. బెడ్‌లాంపు వెలిగించి ట్యాబ్లెటు తీసేద్దామనుకుందిగాని, ఆ విషయమే మరిచి నిద్ర కొరిగిపోయింది.

గాఢనిద్ర, ఎప్పుడూ ఎరగని మొద్దునిద్రపోయింది. లేచి చూసేసరికి ఇక్కడ, ఇలా....

అది చిన్న గది! ఓ మంచం, పేముకుర్చీ, ఓ టేబిలు, అంతే ఆ గదిలో. గది తలుపు బయటినుంచి బంధించారు. గోడనున్న అలమరలో ఏవో రెండు పుస్తకాలున్నాయి. తప్పితే మరేంలేవు. టేబిల్ మీద అలారం టైంపీస్, మంచినీళ్ళ జగ్, జగ్ మీద ఓ గ్లాసు బోర్లించివుంది. ఓ స్టూలుమీద ఆ రోజు పేపర్లు మూడు—తెలుగు, ఇంగ్లీషువి ఉన్నాయి. ఓ మంత్లీ, రెండు వీక్లీలు కూడా వున్నాయి.

సుస్మిత లేచి గదిలో అటు ఇటు పచార్లు చేసింది. గదికి ఓ పక్కనే తలుపుంది. కిటికీ స్థానంలో ఓ వెంటిలేటర్ కప్పుకి ఓ అడుగు కిందుగా వుంది. గదిలోనించి లోపలివైపు మరో తలుపుంది.

ఆమె ఆ తలుపు తోసింది. బాత్ రూం లావెట్రీ చాలా నీట్ గా వుంది. ఎవరూ ఉపయోగిస్తున్నట్టు లేదు గాని, ఎక్కడికక్కడ వాటర్ పైపులున్నాయి.

సుస్మిత బాత్రూం తలుపుమూసి, మళ్ళీ గదిలోనికి అడుగుపెట్టింది. అదో మయసభలా వుంది. గోడలకి నాలుగుపక్కలా ఖరీదైన నిలువుటద్దాలు అమర్చబడి వున్నాయి. గోడ అలమరలో పౌడరు, స్నో, సెంట్ వంటి కాస్మెటిక్స్ ఉన్నాయి. తిలకం, కాజల్ కూడా పెట్టడం మరిచిపోలేదు వాళ్ళెవరో!

సుస్మిత ఓ నిర్ణయానికి వచ్చింది. తనని కావాలని ఈ గదిలో బందీచేశారెవరో. యెవరని వూహించగలదు? వాళ్ళకి తనతో ఏం పని? తనకి కావలసిన సౌకర్యాలన్నీ ఉన్నాయి ఈ చిన్న గదిలో. అంటే ఒక్కరోజో రెండు రోజులోకాదు, కొన్నాళ్ళపాటు తనకీ బందీఖానా తప్ప

దన్న మాట!

సుస్మిత మెదడు ఆలోచనలతో వేడెక్కిపోయింది. తనని అపహరించి తేవలసిన అవసరం, అవకాశం ఎవరి కున్నాయి? ఏమాశించి తనని బంధించారు? అందువల్ల ఎవరికి లాభం? ఎంత ఆలోచించినా ఏమీ తట్టడంలేదు.

తల్లి గుర్తు రాగానే సుస్మిత కళ్ళు చెమర్చాయి. అమ్మ ఎలా వుందో? తెల్లవార్తూనే తను పక్కమీద లేకపోగానే ఎంత కంగారు పడిపోయిందో? నాన్న గారు పోయింతర్వాత అమ్మ తనకి నాన్నగారులేని లోటు రానివ్వకుండా అన్నీ తనే అయి పెంచుతూ వస్తోంది.

నాన్నగారు తనకి బాగా గుర్తే! తనకు పదేళ్ళ వయసులో అయిదోక్లాసు చదువుతుండగా ఓ రోజు స్కూలునించి వచ్చేసరికి అమ్మ ఇంట్లో లేదు. యిల్లు తాళంపెట్టి వుంది. పక్కింటి ఆంటీ తనను యింట్లోకి పిలిచి కూచోబెట్టుకుంది తన పక్కనే! తను అమ్మ గురించి అడిగితే ఆమె వెంటనే ఏం చెప్పలేదు. 'వచ్చే స్తుందమ్మా ఇప్పుడే వచ్చేస్తుంది' అని మాత్రం చెప్పి ఏదో అర్జంటు పనున్నట్టు ఇంట్లోకివెళ్ళి ఏదో పనిలో మునిగిపోయింది.

ఆ తర్వాత ఎనిమిది గంటల ప్రాంతంలో తమ ఇంటి ముందు ఆగిన టాక్సీలోనుంచి నాన్నను మోసుకొచ్చి వరండాలో పడుకోబెట్టారు నాన్న ఆఫీసులో పనిచేసే వాళ్ళు. అమ్మ గోలుగోలున ఏడుస్తూ, బలవంతాన ఆపు కున్నా ఆగని దుఃఖంతో లోపలకొచ్చింది. తను పక్కింట్లోంచి ఒక్క ఉరుకున తమ ఇంట్లోకి పరుగెత్తింది.

తర్వాత తెలిసింది, నాన్నగారు నడుపుతున్న స్కూటర్ని లారీ ఢీకొట్టిందని! రోడ్‌మీదనే నాన్నగారి ప్రాణం

పోయిందని! తను ఏడుస్తూ నేలమీదపడి ఎప్పుడో నిద్ర పోయింది.

నాన్నగార్ని ఎక్కడికో తీసుకుపోవటం, తర్వాత తన మామయ్య, మామయ్య కొడుకు సూర్యప్రకాశ్ — అందరూ వాడిని సూరి అని పిలిచేవారు — తమింటికి రావటం, అమ్మని తీసుకుపోతాం రమ్మనటం, అమ్మ రానని నిరాకరించి ఆ ఇంట్లోనే ఉండిపోవటం, తను అనీపాసులు చూసే నెపంతో మామయ్య సూరిబావతో తమింట్లోనే ఉండిపోవటం నిన్న మొన్న జరిగినట్టు ఊహ తెలిసిన తన జ్ఞాపకాల పొరల్లో దాక్కుని వున్నాయి.

తండ్రి స్మృతిపథంలో మెదలగానే అనుకోకుండానే ఆమె కళ్ళు ఆర్ద్రతను నింపుకుని తడిశాయి.

తనకి గుర్తున్నంతవరకు తండ్రి తనవెంతో గారాబంగా చూసుకునేవాడు. తను అడక్కుండానే, తన నోట్లోమాట నోట్లో ఉండగానే తనక్కావలసింది తెచ్చి పెట్టేవాడు. సాయంత్రాలు పార్కులకి, షైర్లకి తీసుకు పోయేవాడు. సర్కస్‌లు, సినిమాలు చూపించేవాడు. సాధారణంగా అమ్మతోకన్న నాన్నతోనే తను ఎక్కువ చనువుగా వుండేది.

తనకి తాతగారు కూడా చూచాయగా గుర్తున్నాడు. తను మూడో క్లాసు చదువుతుండగా కాబోలు తాత గారు చనిపోయాడు. ఆయనయితే తనని ఒక్క క్షణం కూడా వదిలివుండేవాడు కాదు. తనవెంతో ప్రేమగా చూసుకునేవాడు. తనని గుఱ్ఱంలా ఎత్తుకుని మోసేవాడు. ఆయనకి బుగ్గమీసాలుండేవి. అవి పట్టుకుని తను నిజంగా గుఱ్ఱం మీద ఎక్కినట్టే ఆయన వీపు మీద కూచుని,

ఊతంగా ఆయన మీసాలు పట్టుకుని వూగేది! అలాంటి తాతగారు యిప్పుడు లేరు!

తాతగారు పోయిన రెండు సంవత్సరాలకే తండ్రి కూడా పోవటంతో యీ ఆరేడు సంవత్సరాలుగా తను మనస్ఫూర్తిగా నవ్వటమే మర్చిపోయింది.

నాన్నగారు పోయాక అమ్మ ముఖంలో చిరునవ్వే కరువై పోయింది. అన్నీ నాన్నగారితోనే పోయినట్టు విరాగిలా ఉంటుంది. అందుకే అమ్మని చూస్తే తనకి జాలి అంతకుమించి భయభక్తి కూడా ఉన్నాయి. అందుకే అమ్మతో తాతగారి దగ్గర, నాన్నగారి దగ్గర చూపే చనువు చూపించలేక పోయిందేమో తను!

మామయ్య కూడా తననెంతో ప్రేమగా చూస్తారు గాని, ఎందుకో మామయ్య దగ్గర తనకు చనువుగాని, ఆప్యాయతగాని ఏర్పడలేదు. ఆయన్ని చూస్తుంటే తనకి యెందుకో పెద్దవాడన్న గౌరవం, భక్తి, భయం వంటివి కలగవు. ఏదో తల్లితోబుట్టినవాడనే బంధం తనను ఆయనతో ముడిపెట్టి వుండకపోతే అతనెవరో అన్నట్టే ఉంటుంది తనకు!

అలాగే మామకొడుకు సూరి అన్నా తనకు మంచి అభిప్రాయంలేదు. ఇరవయ్యేళ్ళొచ్చినా ఇంకా టెన్త్ క్లాస్‌లోనే ఉండిపోయిన సూరి తన దృష్టిలో మొద్దబ్బాయి కిందే లెక్క! పదహారేళ్ళకే తను ఇంటర్ పాసయి డిగ్రీ చదువుతోంది. ఇప్పుడు తనకి పద్దెనిమిదేళ్ళు. తనని చూసి సూరి ఇకిలించటం, తనతో మాటలు పెంచుకోవాలని చూడటం తనకి ఎందుకో నచ్చదు! కట్టె విరిచినట్టు మాట్లాడినా, అతను పిలిచినపుడు పలకపోయినా సూరి అదేం లెక్కచెయ్యడు. తను చిరునవ్వు

నవ్వితే అదో తరంలాగా తను మాట్లాడితే అదో ప్రత్యేకతలాగా భావించుకుని మురిసిపోతాడు. ఓ విధంగా అమాయిక జీవి అనే చెప్పాలి.

సుస్మిత ఆలోచనలని చెదరగొడుతూ, తలుపులు తెరుచుకున్నాయి. ఆమె దిగ్గున చూసిందటువైపు.

ఎదురుగా నవ్వుతూ నిల్చున్న వ్యక్తిని చూసి, ఆశ్చర్యంతో నోరు తెరిచింది.

2

"మామయ్యా నువ్వా?" అన్నది అస్పష్టంగా.

సుస్మిత మామయ్య—పల్లంరాజు—యింకా అలాగే నవ్వుతూనే "అవునమ్మా, నేనే!" అన్నాడు.

"నన్నిక్కడికెవరు తీసుకొచ్చారు?" అన్నది సుస్మిత. ఆమెకు ఉక్రోషంతోను, కోపంతోను కంటనీరు తిరిగింది.

"ఎవరు తీసుకొస్తారు, నేనే!"

"ఎందుకు తీసుకొచ్చావు?"

"ఎందుకేమిటమ్మా, మామయ్య ఇంటికి రావటంలో తప్పేముంది?"

"ఇది మామూలుగా రావటమా, ఎత్తుకుని రావటమా?"

"ఏదైనా అనుకో! నువ్వెప్పటికైనా ఈ ఇంటికి రావలిసినదానివే! అందుకే తీసుకొచ్చాను."

"ఎవర్నడిగి తీసుకొచ్చావు?"

"ఎవర్నడగాలి? నాకా స్వతంత్రం లేదా!?"

"ఎవరిచ్చారు నీకా స్వతంత్రం?"

"ఒకరిచ్చేదేమిటి, నేనే తీసుకున్నాను!"

"అమ్మతో చెప్పావా, కనీసం నాతో చెప్పావా? దొంగచాటుగా నిద్రపోతున్న దానిని నిద్రపోతున్న పళంగా

తీసుకొచ్చావు. ఇదేనా నీకున్న స్వతంత్రత?”

“పిల్లినడిగి గంటకడతామా? ఎద్దునడిగి గంత కడతామా?”

“నా పోలిక పశువులతోనా? అవునులే, నువు చేసిన పని మనుషులు చేసేది కాదుగా!”

“సుస్మీ, ఏమిటా మాటలు పెద్దరికం, చిన్నరికం లేకుండా! అమర్యాదగా మాట్లాడతావూ!”

“నువ్వు చేసిన పని పెద్దమనిషి తరహాగా వుందా, నేను గౌరవంగా మాట్లాడటానికి! నువ్విలా నన్నెత్తుకొచ్చావని తెలిస్తే అమ్మ నిన్ను యెన్నటికీ క్షమించదు సరికదా. నిన్ను మా యింటి ఛాయలకికూడా రానివ్వదు. నీ నీడని కూడా అసహ్యించుకుంటుంది.”

“మీ అమ్మకు తెలిసేలా చేస్తానా ఇలాంటి పనులు?”

“అసలు నన్నెందుకు ఎత్తుకొచ్చావు?”

“ఏం, ఇక్కడ నీకు బావుండలేదా? ఇది అచ్చం మీ ఇంట్లోని నీ గదిలా లేదూ!”

“అడిగిన సంగతి వదిలేసి పక్కదారి పట్టిస్తావెందుకు? సూటిగా సమాధానం చెప్పు!”

“చెప్పాను కదా! నువ్వు యింతదాకా నా మేనకోడలివి! ఇప్పుడు నా కోడలిగా చేసుకుందామని!”

“మామయ్యా!” కోపంగా అరిచింది సుస్మిత.

“అదే, ఆ పిలుపే శాశ్వతంగా పిలిపించుకోవాలనే నమ్మి నిన్ను తీసుకొచ్చా మరి!”

“నన్నలా చిన్నపిల్లని చేసి మాట్లాడకు. నామీద యే మాత్రం అభిమానమున్నా, అమ్మమీద ఏ మాత్రం వాత్సల్యం, ప్రేమ మిగిలున్నా—నన్ను వెంటనే అమ్మ దగ్గరికి చేర్చు.”

"తిరిగి మీ ఇంటికి పంపెయ్యటానికా తీసుకొచ్చావు?"

"మరి ఎందుకు? నన్నేం చేయబోతున్నావు?"

"అవన్నీ ముందు ముందు నీకే తెలుస్తాయి. ఇక్కడ నీకేలోటూ రాదు. నీ కావలసినవన్నీ నీ కాళ్ళ వద్దకే వస్తాయి. నీ కిక్కడ రాజభోగం జరుగుతుంది. కాబోయే యజమానురాల్ని ఎలా చూసుకోవాలో వీళ్ళందరికీ తెలుసు!"

సుస్మిత చాలా కోపంగా చూసింది మామయ్యవంక. పల్లంరాజు యిదేం పట్టించుకోనివాడిలా, నౌకర్లువంక చూసి, "అమ్మాయిగారికేలోటూ రాకుండా చూసుకోండి! ఏమైనా తేడాపాడాలొస్తే ఊరుకునేదిలేదు" అన్నాడు. తర్వాత సుస్మితవంక తిరిగి, "బాత్రూంలో నీకావలసినవన్నీ పెట్టే వుంచారనుకుంటాను వీళ్ళు! శుభ్రంగా స్నానంచేసి కూచో. వేడివేడి టిఫెన్, హార్లిక్సు పంపిస్తాను" అన్నాడు పల్లంరాజు.

"నాకేం పంపవద్దు. నన్ను అమ్మ దగ్గరికి తిరిగి పంపే వరకు యీ యింట పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టను."

"శపథం చేస్తున్నావా?"

"అంతేననుకో! నా గురించి నీకు బాగా తెలుసు. చావనైనా చస్తానుగాని, నా యిష్టానికి వ్యతిరేకంగా నాచేత యేమీ చేయించలేవు."

పల్లంరాజు ఆమె మాటలధాటికి, తీవ్రతకు జంకాడు. సుస్మిత అన్నంతపని చేస్తుంది. చాలా పట్టుదలగల పిల్ల. తల్లికన్న పట్టుదలకలది! తన పంచన ససేమిరా తల దాచుకోనని మొండికేసింది ఆమె తల్లి. అందుకే తనే నూరితో వాళ్ళింటికొచ్చి ఉంటున్నది!

పల్లంరాజు సుస్మితవంక రెండు క్షణాలు చూసి, తనక్కడ నిల్చుని ఉండటాన్నికూడా ఆ పిల్ల సహించలేక

పోతున్నదని గ్రహించి మౌనంగా బయిటికెళ్ళిపోయాడు.

సుస్మిత బోనులోపడ్డ పులిలా ఆ గదిలో కాసేపు తిరిగింది. ఇది మామయ్య యిల్లేనా, లేక, తమ వూళ్ళోనే మరో ఇల్లా? అనుకుంటూ ఆలోచిస్తూ గడిపింది కాసేపు.

ఎలాగైనా యీ బందిఖానానించి బయట పడాలి! మామయ్య యిక్కడికెందుకు తీసుకువచ్చాడో సూచాయగా అర్థమవుతోందామెకు. క్షణక్షణానికి మామయ్య మీద అసహ్యం పెరిగిపోతోంది. ఎలాగైనా యిక్కడి నుంచి బయటపడాలి. ఎలా, ఎలా?

పనిమనుషులు టిఫిన్, హార్లిక్స్ తెస్తే వాటిని గోడకేసి కొట్టింది. హార్లిక్స్ వాళ్ళ ముఖాలమీద చిమ్మింది. అంతే, మళ్ళీ వాళ్ళు ఆమె పక్కకు రావటానికి సాహసించలేదు.

3

సాయంత్రంవరకు నిరాహారదీక్ష పూనినట్టు నిజంగానే పచ్చి మంచినీళ్ళు ముట్టలేదు సుస్మిత. మూడుగంటల ప్రాంతాల పల్లంరాజు వచ్చి బతిమాలి వెళ్ళాడుగాని ఆమె పలకనైనా పలకలేదు.

చీకటిపడింది. గదంతా చిమ్మచీకటి అలముకున్నా లైటు వేసుకోవాలనిపించలేదు సుస్మితకు. తల్లి గురించి, యింటిదగ్గర పరిస్థితి గురించి ఆలోచిస్తోందామె. తనని రాత్రికి రాత్రే యిక్కడికెలా తీసుకురాగలిగాడు మామయ్య—అని ఆలోచిస్తోంది.

మామయ్య వాళ్ళది విజయవాడ. తమది హైదరాబాదు. రాత్రికి రాత్రి హైదరాబాదునించి విజయవాడ ఎలా తీసుకురాగలిగాడు? దాదాపు ఏడుగంటల ప్రయాణం కార్లో తీసుకొచ్చినా కూడా.

రాత్రి పదకొండు గంటలకి తను నిద్రపోయింది. ఆ వెనువెంటనే తనని కార్లో వేసుకుని వెళ్ళటం అసంభవం! తెల్లారి ఆరుగంటలయ్యేసరికి తను విజయవాడలో ఆ గదిలో నిద్రలేవటం సహజంగా అనిపించటంలేదు. తనని స్పృహ తప్పించి తీసుకువచ్చినా అంత తక్కువ వ్యవధిలో తనని ఊరు మార్చి, మరో ఇంట్లో అలాంటి గదిలో పడుకోబెట్టడం సాధ్యం కాదు. బహుశా అది విజయవాడ అయ్యుండదు. హైదరాబాద్, లేదా దగ్గరలో మరో ఊరో అయివుండొచ్చు!

సుస్మిత తీవ్రంగా ఆలోచిస్తోంది. ఎలాగైనా బయట పడి పారిపోవాలి! ఇది యే ఊరయినా సరే, ముందిక్కడనుంచి బయటపడాలి. అది రాత్రి సమయమని గాని, బయటికి వెళ్ళాక తను యింటికెలా చేరగలుగు తాననిగాని ఆమె యేమాత్రం ఆలోచించటంలేదు. మామయ్య అనబడే యీ మృగం బారినుండి, యీ బందీఖానానుండి బయటపడాలి, అంతే!

రాత్రి యేడుగంట లయింది. పనిమనిషి కాబోలు నవ్వుతూ వచ్చి నిలబడింది. "అమ్మా, భోంచెయ్యవా?" అని మెల్లగా అడిగింది.

సుస్మిత దానివంక చూసి చిన్నగా నవ్వింది.

"ఇలా దగ్గరగారా!" అన్నది. అది భయపడుతూనే దగ్గరకొచ్చింది. సుస్మిత మెరుపుదాడి చేసింది. ఆమెనిపట్టి ఒక్క తోపు తోసింది. ఆ వూపుకి దాని తలపోయి గోడకి కొట్టుకుంది. స్పృహతప్పి కిందపడిపోయింది పని మనిషి.

ఒక్క క్షణం ఆమెవంక చూసి, తలుపు తెరుచుకుని బయటికొచ్చింది. వరండాలో ఎవరూ లేరు—అది పెద్ద

హాలులావుంది. హాలుపక్కనూ అటువంటి గదులున్నాయి. వంటగదిలోనుండి కాబోలు పోపువాసనలు వస్తున్నాయి.

సుస్మిత అడుగులో అడుగు వేసుకుంటూ హాలుదాటింది. గదుల్లో ఎవరున్నారో తెలీదు. తలుపులు మూసివున్నాయి. ఇందాకటి పనిమనుషుల్లో ఒకామె, ఓమగాడు ఓపక్కగా కూచుని కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

బయటికి పోవాలంటే వాళ్ళిద్దర్నీ దాటిపోవాలి. ఆ యిల్లు యిదివరకెప్పుడూ ఆమె చూసి వుండలేదు. మామయ్య యింటికి యిదివరలో రెండుమూడుసార్లు వచ్చింది తల్లితో. ఇది ఖచ్చితంగా ఆ ఇల్లు కాదు. మరి ఎక్కడి యిల్లు? ఇదే వూరు?

సుస్మిత అవకాశంకోసం అలాగే వరండాలోని కీనీడలో చూసింది కాసేపు. పనిమనిషి మొగాడు వంటగదిలోకి కాబోలు జంటగా వెళ్ళిపోయారు. సుస్మిత రెప్పపాటులో వరండానుంచి హాలుగుండా, బయిటికి పోయే ద్వారంవైపు దూసుకుపోయింది.

ఆమె అనుమానించినట్టే అయింది. బయట అల్సేషియన్ కుక్క గొలుసుకి కట్టివుంది. సుస్మితను చూడగానే భోయ్‌మంటూ మీదికి ఉరకబోయింది. అదృష్టవశాత్తు దాన్ని గొలుసుతో వీధివైపు కటకటాలకు కట్టేసి వుంచారు గాబట్టి సరిపోయిందిగాని, లేకుంటే సుస్మితని ఖండఖండాలుగా చీల్చేసి వుండేది!

సుస్మిత దిగజారబోయిన గుండెను జాగ్రత్తగా అదిమి పట్టుకుంది. కుక్క అరుపుకి లోపల కలకలం వినిపించింది. అంటే యిందాకటి పనివాళ్ళు మామయ్యా వగైరా బయటకి వస్తూండవచ్చు!

సుస్మిత గేటువైపు నాలుగంగల్లో చేరుకుంది. గేటు

తాళం వేసివుంది లోపలివైపు. తనకి అడుగడుగునా పరీక్ష ఎదురవుతున్నా ఆమె వెనుదియ్యలేదు. గేటు మూడు అడుగులకన్నా ఎత్తులేదు. గేటుకి అడ్డుగా వున్న యినుపరాడ్ మీద కాలేసి ఎక్కింది. అవతలివైపు దూకేసింది. కట్టి నేల తగిలింది.

ఈలోపల వెనుకనించి పనివాళ్ళు యింకా ఎవరో వచ్చి గేటు దగ్గరకు చేరారు. తలుపుకున్న తాళం తెరుస్తున్నట్టున్నారు. సుస్మిత అటు యిటు చూసి, ఆ బిల్డింగు పక్కనున్న సందులోకి పరుగెత్తింది.

సుస్మిత సందులో చాలా వేగంగా నడుస్తూ వెనక్కి చూసింది. అంతే ఆమె గుండె జల్లుమంది. పనివాళ్ళు వెనకనించి పరుగెత్తుకుని వస్తున్నారు.

ఇక ఎంతోసేపు అలా పరుగెత్తలేనని ఆమె గ్రహించింది. ఏ క్షణంలోనైనా వాళ్ళు తనని పట్టుకోవచ్చు. అప్పుడు తన బతుకింకా దుర్భర మవుతుంది. మళ్ళీ ఆ బందిఖానా తల్చుకోవటానికే ఒళ్ళు గగుర్పొడుస్తోంది.

సుస్మిత పక్కలకు చూసింది. ఇంకా బాగా రాత్రి పొద్దుపోకపోవటంతో యిళ్ళలో దీపాలు వెలుగుతునే వున్నాయి. జనం యింకా నిద్రలు పోలేదనటానికి ఇళ్ళలోని మాటల సవ్వడి, సంకీర్తన ధ్వనులే నిదర్శనం!

సుస్మిత ఓ ఇంటి తలుపులు తెరిచివుండటం చూసింది. అంతే ఆలస్యం చెయ్యకుండా చటుక్కున గుమ్మం ఎక్కి ఆ యింట్లోకి ప్రవేశించింది. లోపలికి చేరబడి తలుపులు మూసేసింది. కొద్ది క్షణాలు ఆ తలుపులకే చేరబడి నిల్చుండిపోయింది.

వీధిలో వాళ్ళు పరుగెడుతూ పోయిన సవ్వడి వినిపించింది. ఆ యింటిముందునించీ వాళ్ళు పరుగెత్తటం, ఏదో

మాట్లాడుకుంటూ వెళ్ళటం ఆమెకు వినిపించింది.

ఫరవాలేదు, తనీ యింట్లోకి రావటం వాళ్ళు చూడ లేదు. ముందుకే పరుగెత్తి వెళ్ళిపోయారు. గుండెలమీద చెయ్యివేసుకుని కాసేపు అలుపు తీర్చుకోవటానికి అలాగే నిల్చుండిపోయింది సుస్మిత!

4

"ఎవరు వారు? ఏం కావాలి?" అన్న బొంగురు గొంతు వినిపించింది.

సుస్మిత ఉలిక్కిపడింది. ఏమని సమాధానం చెప్పాలి? కాసేపు ఏమీ పాలుపోలేదు.

ఇంతలో ఆ బొంగురు గొంతు తాలూకు మనిషి వీధి గుమ్మం దగ్గరకొచ్చి సుస్మితను చూసింది.

దగ్గరగా, మరింత దగ్గరగా సుస్మితకి ఎదురుగా నిల్చుని, "ఎవరమ్మా నువ్వు. ఏం కావాలి?" అన్న దామె ఎంతో ఆదరంగా. ఆమెకు దాదాపు ఏభై ఏళ్ళుంటాయి.

ఆమె అలా అడుగుతుంటే సుస్మితకి కంటనీరు తిరిగింది.

"నేను.... నేను...నా పేరు సుస్మిత" అన్నది. అంతకు మించి వివరాలు ఆమె నోట రాలేదు.

ముసలామె ఆమె బాగా భయపడిపోయినట్లు గ్రహించింది. సుస్మిత వెన్ను నిమిరింది. బుగ్గలమీదికి రాబోతున్న కన్నీటిని మధ్యలోనే తుడిచేసింది సుస్మిత.

"రామ్మా, లోపలికిరా! ఇప్పుడేం చెప్పొద్దులే, తర్వాత తీరిగ్గా చెబుదువుగాని" అంటూ సుస్మితని రెక్క పట్టుకుని లోపలికి తీసుకుపోయింది ముసలామె.

ఆమె వెంట మంత్రముగ్ధలా నడిచి లోపలికి వెళ్ళింది సుస్మిత.

లోపల గదులు చాలా అందంగా వున్నాయి. ఖరీదైన పెయింట్‌తో తళతళలాడుతున్న గోడలు, గోడలకి తైలవర్ణ చిత్రాలు. గదులనిండా ఖరీదైన సోఫా సెట్లు, రోజ్ వుడ్ కుర్చీలు, డెకోలం ఫోల్డింగ్ టేబిల్సు—ఆ యింటి వైభవాన్ని చెప్పకనే చెప్తున్నాయి.

"అలా కూచోమ్మా!" అన్నది ముసలామె ఓ కుర్చీ చూపించి తను మరో కుర్చీలో కూచుంటూ.

సుస్మిత సంకోచిస్తూనే కూచుంది. ఇంట్లో చూడబోతే ఆ ముసలామె ఒక్కతే వున్నట్టనిపిస్తోంది. అంతవరకు ఎవరూ బయటికి రావటం ఆమె చూడలేదు.

ముసలామె చటుక్కున అడిగింది. "నీ ముఖం చూస్తుంటే ఏమీ తిన్నట్టు అనిపించటంలేదు, అవునా?"

సుస్మితకి ఆకలి ఒక్కసారిగా విజృంభించింది. అయినా పరాయిచోట ముక్కూ మొహం తెలీని మనిషి ముందు తన బలహీనతని బయటపెట్టుకోవటానికి ఆమెకు మనస్కరించలేదు. అభిమానం అడ్డొచ్చింది.

"అహఁ, తిన్నాను...." అన్నది పొడిపొడిగా.

ముసలామె చిన్నగా నవ్వింది. "చూడమ్మా, నా దగ్గర మొహమాట పడి కడుపు మాడ్చుకోకు. ముందు కాస్త అన్నం తిందువుగాని రా!" అంటూ సుస్మిత చెయ్యి పట్టుకుని బలవంతాన వంటగదిలోకి తీసుకుపోయింది.

ముసలామె కంచంలో అన్నం, కూరలు వడ్డించింది. అంతవరకు నిద్రాణమై వున్న ఆకలి మరింతగా ఆవులించుకుంటూ తన్నుకొచ్చింది.

సుస్మిత అవురావురుమంటూ తిన్నది. ఎవరో పరాయి మనిషనిగాని, పరాయి యింట తింటున్నాననిగాని, ఆమె సంకోచించలేదు. ఉదయంనించీ ఏమీ తినకపోవటం,

పరుగెత్తటంతో వచ్చిన నీరసం, టెన్షన్ ఆమెని బాగా లొంగదీసుకున్నాయి. నిస్త్రాణ వచ్చేసింది.

ఆకలి బాధ మహా చెడ్డది! ఆ ముసలామె వడ్డిస్తుంటే సుస్మిత తింటోంది. అలా ఎంత తిన్నదో, ఎంతసేపు తిన్నదో ఆమెకే తెలీదు.

ముసలామె ఆప్యాయంగా కొసరి వడ్డించింది. గడ్డ పెరుగుపోసి ఆవకాయముక్క పెట్టింది. సుస్మిత సంతృప్తి కరంగా భోజనం ముగించి లేచింది.

ముసలామె సుస్మితని తీసుకుని హాల్లోకి వచ్చింది. ఇద్దరు మళ్ళీ కూచున్నాక ముసలామె అడిగింది. "ఎవరమ్మా, నువ్వు? నేను చూసేసరికి బాగా అలసిపోయి ఉన్నావు. ఆయాసపడుతున్నావు. ఏమిటి కారణం? నిన్నెవరైనా తరుముకుంటూ వచ్చారా?" అనడిగింది.

సుస్మిత ఆమెతో నిజం చెప్పటానికి సంకోచించింది. అయినా అబద్ధం చెప్పటం ఎలాగో ఆమెకి తెలీదు. అందుకే ఉన్నదున్నట్టు చెప్పేసింది.

మామయ్య తనని తీసుకొచ్చి బంధించటం, తనని బావకిచ్చి పెళ్ళిచేస్తాననటం, తను భయపడి తప్పించుకు పారిపోవటం—వ:సగా అన్నీ చెప్పేసింది.

ముసలామె చాలా సానుభూతితో విన్నది. "అయ్యో నా తల్లీ, నీకింత లేతవయసులో ఎంత కష్టం వచ్చిందమ్మా. మీ మామయ్య ఎంత నిర్దయుడు! నీకిష్టంలేకుండా నీచేత కానిపని చెయ్యించాలని చూస్తాడా? పైగా మేనకోడలివని కూడా చూడకుండా ఎత్తుకొస్తాడా? ఎంత మాట!" అన్నది దవడలు నొక్కుకుని.

సుస్మిత మనసు ఆమెపట్ల క్షణక్షణానికీ కృతజ్ఞతతోను, గౌరవంతోను నిండిపోతోంది.

"నీకొచ్చిన కష్టం చూసి నా గుండె తరుక్కుపోతోందమ్మా! నిన్ను క్షేమంగా మీ యింటికి పంపించే ఏర్పాటు నేచేస్తానుగాని, నువ్వు యీ రాత్రికి హాయిగా యిక్కడే నిద్రపో! అప్పుడు రాత్రి పదకొండుగంటలు కావస్తోంది" అన్నదామె.

"అమ్మ ఎలావుందో, నే నేమైపోయాననుకుంటుందో! నామీద బెంగ పెట్టుకుని ఉంటుంది."

"మరేం ఫరవాలేదమ్మా! ఉదయం ఏడుగంటలకి బయల్దేరితే పన్నెండుగంటలకంతా మీ ఇంట్లో వుంటావు" అన్నదామె.

సుస్మితకి చటుక్కున గుర్తొచ్చింది. "ఇదేవూరు?" అనడిగింది.

"విజయవాడ!"

"అదే, హైదరాబాదునించి ఒక్క రాత్రిలో విజయవాడ ఎలారాగలిగాను?" అన్నది సుస్మిత అమాయకంగా.

ముసలామె సుస్మిత ఆ మాటలు పలికిన తీరుకి బాగా ముచ్చటపడిపోయింది. "ఎందుకు రాలేవు?" చిన్నకారులో ఐతే ఐదుగంటల ప్రయాణంలోనే! అంతకన్న తక్కువ సమయంలో కూడా ప్రయాణం చెయ్యొచ్చు" అన్నది.

అయితే రాత్రి పదకొండు గంటలకి తను నిద్రపోయిన వెంటనే యేదో మత్తుమందిచ్చి స్పృహతప్పించి తనని హైదరాబాదునించి మామయ్య యిక్కడికి తీసుకొచ్చాడన్నమాట తన యింటికి! అంటే మామయ్య యింట్లో దాదాపు ఓ గంట నిద్రపోయాక తనకు మత్తు వదిలి ఉంటుంది.

అనుచరులమధ్య ఎప్పుడో నిద్రపట్టేసింది. అలాయిలా కాదు. ఒళ్ళు తెలీకుండా పట్టేసింది—గాఢనిద్ర!

5

ఉదయం ముసలామె నిద్రలేపేవరకు మెలకువరాలేదు సుస్మితకు. తన మొద్దునిద్రకు తనలోతనే సిగ్గుపడుతూ లేచింది సుస్మిత.

ముసలామె బాత్రూం చూపించింది. ఓ గంటలో స్నానాదికాలు ముగించుకొచ్చేసరికి సరికొత్త చీర, బ్లౌజు తనకోసం ముసలామె సిద్ధంగా పెట్టి వుంచింది.

“నేనెప్పుడూ చీరకట్టుకోలేదండి!” అన్నది సిగ్గుపడుతూ సుస్మిత.

“మరి మా యింట్లో నీకు సరిపడే పావడాలు కండువాలు లేవమ్మా! ఇది నా కూతురు చీర, రవిక, సరిపోతాయి, కట్టుకో” అన్నది ముసలామె.

సుస్మిత అవస్థపడి చీర కట్టుకోవటం అప్పటికప్పుడే నేర్చుకుని కట్టుకుంది. రవిక సరిగా తనకి కొలతతీసుకున్నట్టు సరిపోయింది. అద్దంలో తనని చూసుకుని తనే ఆశ్చర్యపోయింది. తనెంతో ఎదిగిపోయినట్టు పెద్దరికం వచ్చేసినట్టు అనుభూతి!

వేడి వేడి టిఫిన్, ఓవల్టీన్ తెచ్చి పెట్టింది వంటమనిషి. సుస్మిత ముసలామె కూచుని తిన్నారు.

ముసలామె చాలా ఆత్మీయంగా మాట్లాడుతోంది.

“నిన్ను మీ యింటికి పంపిస్తున్నాను. జాగ్రత్తగా మా డ్రైవరు తీసుకువెళ్ళి మీ యింట దించివస్తాడు సరేనా?” అన్నది నవ్వుతూ.

సుస్మిత బుద్ధిమంతురాలిలా తలూపింది.

“ఖాసిం!” అని పిలిచింది ముసలామె.

పహిల్వాన్‌లా వున్న ఓ భారీమనిషి లోనికొచ్చాడు.

“ఇదిగో అమ్మాయి. జాగ్రత్త. ఏమీ తేడాపాడాలు

రాకూడదు" అన్నది హెచ్చరికగా.

"అలాగేనమ్మా! నేజాగ్రత్తగా వుంటానే" అన్నాడు ఖాసిం.

సుస్మిత చేతులు రెండూ జోడించి ముసలామెకు దండం పెట్టింది. ముసలామె ఆమెను దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుంది.

ఖాసిం కారుతీసి సిద్ధంగా వుంచాడు. ముసలామె కారువరకు వచ్చి వీడ్కోలు చెప్పింది.

"మీరు కూడా రాకూడదమ్మా! ఈ సంగతి చెపితే మా అమ్మ మిమ్మల్ని నెత్తిన పెట్టుకుంటుంది" అన్నది సుస్మిత.

"మా డ్రైవరు మీ యిల్లు చూస్తాడుగా యీ రోజు! తర్వాత తీరిక చేసుకుని నా మనమరాల్ని చూడటాని కొస్తాను" అన్నది ముసలామె నిండుగా నవ్వుతూ.

ఖాసిం కారు స్టార్టు చేశాడు.

కారు విజయవాడ సిటీ లిమిట్సు దాటింది. చల్లటి గాలి రివ్వున కిటికీల్లోంచి లోపలికి వస్తుంటే హాయిగా జోలపాడినట్టుంది. సుస్మిత మనసు తేలిగ్గా వుంది. దూది పింజెలా తేలిపోతోంది.

ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు. కారు చిన్న జర్కుతో ఆగగానే చటుక్కున మెలకువవచ్చింది. కళ్ళు తెరిచింది.

కారు ఓ గల్లీలో ఆగివుంది. ఖాసిం కారు దిగుతున్నాడు.

సుస్మిత కిటికీలోంచి బయిటికి చూసింది.

హైదరాబాదు అప్పుడే వచ్చేసిందా? చేతికున్న వాచీలోని ముళ్ళు పదకొండు అయినట్టు చూపిస్తున్నాయి.

తను విజయవాడలో బయల్దేరినపుడు ఉదయం ఎనిమిది కావచ్చింది. అంటే మూడుగంటల ప్రయాణం జరిగింది.

హైదరాబాదు యింకా చేరలేదు. అది సూర్యాపేటో మరోవూరో కావచ్చుననుకుంది.

ఖాసిం ఆ వీధిలోని ఓ యింట్లోకి వెళ్ళి బయటకు వచ్చాడు. సుస్మితకు ఆ వీధి చాలా అసహ్యంగా, గలీజుగా వున్నట్టు అనిపించింది.

ఓపెన్ డ్రయినేజ్ ముక్కుపుటల్ని అదరగొడుతోంది. ఇళ్ళు చూడ్డానికి బాగానే కనిపిస్తున్నాయిగాని, మనుషులు ఎవరూ ఎక్కువగా మసలటంలేదు. ఏదో నిశ్శబ్ద వాతావరణంలో మరమనుషుల్లా యాంత్రికంగా కదులున్నారు అటు యిటు.

ఆడవాళ్ళు గుమ్మాల్లో నించుని వున్నారు. అందరూ నిద్రమత్తులోనే జోగుతున్నట్టు కనిపిస్తున్నారే గాని చురుగ్గా, ఉత్సాహంగా కనిపించటంలేదు.

ఖాసిం తలుపు తెరిచాడు. "దిగమ్మా!" అన్నాడు.

సుస్మిత నివ్వెరపోయి, "ఎక్కడికి?" హైదరాబాదు యింకా రాలేదుకదా! అన్నది.

"ఇది హైదరాబాదేనమ్మా! ఓల్డు సిటీ యిలాగే ఉంటుంది, నువ్వెప్పుడూ రాలేదనుకుంటాను! అది మా యిల్లు, ఓ అయిదు నిమిషాలు "చాయ్ తాగి వెళ్ళిపోదువుగాని రామ్మా!" అన్నాడు ఖాసిం ఎంతో నమ్రతగా, ఆప్యాయంగా.

"అరె మూడు గంటల్లో విజయవాడనించి హైద్రాబాద్ తోలుకొచ్చేశావే! రియల్లీ వండర్‌ఫుల్!" అన్నది సుస్మిత చిన్నపిల్లలా కేరింతలు కొడుతూ.

"ఈ ఖాసిం చేతిలో స్టీరింగ్ పడితే బండి గాల్లో ప్రయాణం చేస్తుంది. రామ్మా!" అన్నాడు ఖాసిం.

సుస్మిత కారు దిగింది. గల్లీలోని యిళ్ళలోనించి

ఆడవాళ్ళు వీళ్ళవంకే ఆసక్తిగా చూస్తున్నారు. సుస్మితకి ఒంటిమీద తేళ్ళు జెర్రెలు పాకుతున్నట్టనిపిస్తోంది. వాళ్ళ చూపులెన్నెదుర్కోలేక -మౌనంగా ఖాసింని అనుసరించింది. ఖాసిం సుస్మితని ఓ యింట్లోకి తీసుకువెళ్ళాడు.

అది బాగా యిరుగ్గా వుంది. లోపల ఎవరూ కనిపించ లేదు. ఖాసిం ఆమెని అక్కడే వున్న కుర్చీలో కూచో బెట్టి లోపలి గదిలోకి వెళ్ళాడు.

సుస్మిత ఆ యింటి వాతావరణం చూసి ముఖం చిట్లించింది. గోడలన్నీ వెల్ల వెలిసిపోయి అసహ్యంగా ఉన్నాయి. తాంబూలం ఉమ్ములతోను, ఏదో దుర్గంధం తోను చవుడు రాలిపోతున్నట్టున్నాయి. మీద కూలిపడి పోతుందన్నట్టుంది! యెక్కడపడితే అక్కడ విప్పిన గుడ్డలు, చిరాకుగా పడున్నాయి.

ఖాసిం యెవరో ముసలామెతో బయటికొచ్చాడు. చూడటానికి మొగాడిలా వున్న ఆ ముసలామె గొంతు కూడా అందుకు తగ్గట్టే బొంగురుగా కర్కశంగా వుంది.

"ఈ పిల్లేనా?" అన్నది నఖశిఖపర్యంతం సుస్మితని శల్య పరీక్ష చేస్తూ. ఖాసిం తలూపాడు.

సుస్మిత అర్థంకానట్టు చూసిందతనివంక. ఖాసిం తల వంచుకుని వెళ్ళిపోతున్నాడు. ఆమెకెందుకో భయంవేసి నట్టనిపించింది. "ఖాసిం!" అంటూ పిలుస్తూ చటుక్కున లేచి ముందుకు అడుగు వెయ్యబోయింది.

"అగక్కడే!" అన్నది ముసలామె.

సుస్మిత అనుమానం బలపడింది. చటుక్కున తలుపు దగ్గరికి నాలుగడుగుల్లో చేరుకుంది. వెనకనుంచి యిద్దరు ఆడవాళ్లు అకస్మాత్తుగా చెరో రెక్క పట్టుకుని ఆమెని పట్టి ఆపేశారు.

6

సుస్మితని బలవంతాన లాక్కొచ్చి గదిలో పడేశారు ఆ యిద్దరు ఆడవాళ్లు. బొంగురుగొంతు ముసలామె కర్కశమైన చూపుల్తో సుస్మితని కాల్చేస్తున్నట్టు చూసింది.

"ఎవరు మీరంతా? ఏమిటీ మోసం?" కోపంతోను, ఉక్రోషంతోను చిగురుటాకులా వణికిపోయింది సుస్మిత.

"మోసమేమిటే, నిన్ను పబ్లిగ్గా కొనుక్కున్నాను". అన్నది ముసలామె.

"నన్ను కొనుక్కున్నావా? నేనేమైనా సంతలో పశువు ననుకున్నావా, వస్తువు ననుకున్నావా కొనుక్కోవటానికి? మర్యాదగా విడిచిపెట్టు. లేకపోతే పోలీసులకి రిపోర్టిస్తాను" అన్నది సుస్మిత.

ముసలిదానితో బాటు ఆ యిద్దరు ఆడవాళ్ళు కూడా ఫక్కున నవ్వారు.

"పోలీసులకి రిపోర్టిస్తుందంటే వెర్రది! ఆళ్ళేంజేత్తారు? మళ్ళీ మనకే అప్పజెప్పేత్తారుగదా! మన సంగతి ఆళ్ళకి తెల్సు, ఆళ్ళ సంగతి మనకి తెల్సు!....ఇదిగో చూడు పిల్లా, ఆట్టే నీలిగావంటే వొళ్ళు పచ్చడయిపోగల్దు. జాగర్త....ఒసేవ్, వెంకీ, దీన్ని జాగ్రత్తగా చూసుకో! దీన్ని దార్లో బెట్టే డూటీ నీదే! తేడావొస్తే నేనూర్కోను, తెల్సుగా!" అన్నది ముసల్ది.

వెంకి అని పిలవబడ్డ వెంకటమ్మ తలూపింది. ఇందాకటి యిద్దరు ఆడవాళ్ళలో ఆమె ఒకర్తి.

"లోపలికి పద!" అన్నది వెంకటమ్మ సుస్మిత జబ్బ పట్టుకుని లాక్కుని వెళ్తూ. రెండో మనిషి సుస్మితని వెనక నుంచి తోసుకుంటూ వెళ్ళింది. ఆ యిద్దర్నీ విసురుగా కసిరికొట్టింది సుస్మిత. గింజుకుంది. చివరికి వెంకటమ్మ

చెయ్యిని కొరికింది. అయినా ఆమె సహించి, అలా లోపలికి లాక్కుపోతూనే వుంది.

"కదలకుండా పడుకో! ఏమాత్రం గొడవ చేసినా ముసల్ది నీ పీక పిసికేస్తది, తర్వాత ఏమనుకున్నా లాభముండదు పిల్లా!" అన్నది రెండో ఆమె.

వెంకటమ్మ చేతికి కట్టు కట్టుకుంటోంది. సుస్మిత రక్తం వచ్చేలా కొరికిందామె చేతిని.

అప్పుడు సమయం రెండుగంటలు దాటింది మధ్యాహ్నం.

"ఇదిగో, ఆ పిల్లకి యీ కూడెట్టు, యెప్పుడో బెజవాడలో కంత టిపిని తినుంటుంది! ఆకలెయ్యటంలేదులాగుంది" అన్నది ముసల్ది లోపలినుంచి.

వెంకటమ్మ రెండంగల్లో వెళ్ళి ఆమెనుంచి అన్నం కంచం తెచ్చి టేబిలుమీద పెట్టింది. ఉన్నంతలో ఆ యింటికంతకీ కాస్త శుభ్రంగా ఉన్నది ఆ గదే!

సుస్మిత కూచోవటానిక్కూడా యిష్టపడటంలేదు. ఆ ఇంటి వాతావరణం కడుపులో తిప్పినట్టవుతోంది. బయట పడే మార్గం గురించి తీవ్రంగా ఆలోచిస్తోంది. ఓ ప్రమాదంనుంచి మరో ప్రమాదంలో చిక్కుకున్నట్టుంది.

"ఇదిగో, పిల్లా! కాస్సంత అన్నం తిను! ఆకలేస్తలేదా!?" అన్నది వెంకటమ్మ దగ్గరగా వచ్చి. ఆమెకి ఓ పక్క సుస్మిత అంటే భయంగానే వుంది—మీదపడి కరుస్తుందేమోనని!

"నాకేం వద్దు. మీ రిద్దరు నా ముందునుంచి బయిటికి పోండి!" అన్నది కోపంగా సుస్మిత. ఉక్రోషంతోను, అవమానంతోను, చేతకానితనంతోను ఆమెకి దుఃఖం తన్నుకుని వస్తోంది. ఓ పక్క ఆకలి కరకరమంటోంది. ఉదయం విజయవాడలో తిన్న టిఫినే! మళ్ళీ ఏం తిన

లేదు. అయినా ఆమె అభిమానం చంపుకుని తినటానికి సిద్ధంగాలేదు. ఎదురుగా అన్నంవున్నా దానివంకనైనా కన్నెత్తి చూడటంలేదు.

వెంకటమ్మ ధైర్యంచేసి సుస్మిత చెయ్యిపట్టుకుని, "తిను! ఆకలికి వుండగలవా?" అన్నది జాలిగా.

రెండో మనిషి ఎప్పుడో బయటకి వెళ్ళింది, ముసలామె పిలవటంతో. గదిలో సుస్మిత, వెంకటమ్మ ఉన్నారు. సుస్మిత చటుక్కున చేతులు రెండూ జోడించి, "నన్ను వదిలిపెట్టెయ్యి నీకు దణ్ణం పెడతాను" అన్నది జాలిగా.

వెంకటమ్మకి ఆ పిల్ల ఎటువంటి కుటుంబంనించి వచ్చినదో, ఎలాంటిదో అర్థమైపోయింది. ఆమెమీద జాలివేసింది.

"ఇక్కడకు తీసుకొస్తున్నట్టు నీకు తెలీదా?" అన్నది.

"ఉహుఁ! మా ఇంటికి తీసుకెళ్తున్నానని ఖాసిం చెప్పాడు. నిజమేననుకున్నాను."

"మీ ఇంటికా? అసలు మీదే వూరు?"

"హైదరాబాదు."

"మరి బెజవాడ ఎందుకు వెళ్ళావు? ఖాసింకి ఎలా దొరికావు?"

"నేను దొరకడమేమిటి? బెజవాడలో మా మామయ్య ఇంటనుంచి తప్పించుకుని పారిపోతూ అమ్మమ్మ లేదూ, ఆమె ఇంట్లోకి వెళ్ళాను. ఆమె చాలా మంచిగా మాట్లాడింది. అన్నం పెట్టింది. రాత్రి అక్కడే పడుకున్నాను. పొద్దున్న ఖాసింతో నన్ను కారులో హైదరాబాదు పంపుతున్నానని చెప్పింది. చూడబోతే ఖాసిం ఇక్కడికి తీసుకొచ్చాడు."

"నిన్ను మా ముసలమ్మకి — మేమంతా 'అమ్మా' అని పిలుస్తాంలే—అమ్మేశాడు."

[illegible] [illegible]గా చూసింది. "మళ్ళీ అదేమాటా? నన్ను అమ్మడమేమిటి?" అన్నది.

వెంకటమ్మ జాలిగా చూసింది సుస్మిత వంక.

"చూడమ్మా, నీ పేరేమిటి?" అన్నది.

"సుస్మిత."

"పాపం, ఇలాంటి యిళ్ళుంటాయనిగాని, యిలాంటి మనిసి రూపంలో వున్న జెంతువులుంటాయనిగాని నీకు తెల్వదుకదా! ఇదో నరకమన్నమాట! ఇందులో కాలెట్టినోళ్ళకి ఇక బయట పెపంచం తెల్దు. అసలు ఆళ్ళ గురించే ఆళ్ళకి ఆలోచించుకోవటానికి టయిముండదు. చూడమ్మా, నిన్ను బయిటికి పంపించటానికి నాకేమీ అధికారంలేదు. ముసల్ది చూస్తే నన్ను, నిన్ను కూడా ఉప్పు పాతరేసే సది" అన్నది వెంకటమ్మ.

సుస్మిత జాలిగా చూసింది. "ఇదే ఊరు?" అన్నది.

"ఒంగోలు."

"విజయవాడ నించి హైదరాబాదు తీసుకెళ్తానని ఇలా ఒంగోలు తీసుకొచ్చేశాడన్నమాట ఖాసిం. వాడికి నేనేం అపకారం చేశాను?" దుఃఖం తన్నుకొచ్చేస్తుంది సుస్మితకి. ఇక ఆపుకోలేక భోరున ఏడ్చేసింది.

"ఏయ్ పిల్లా ఏటా యేడుపులు? ఏమే వెంకీ దాన్ని నయానోన్న బయానోన్న లొంగదియ్యి. రాత్తిరికి కోటపాడు మునసబుగారొత్తానని కబురెట్టారు. యెన్నాళ్ళనుంచో ఇలాంటి కేసొత్తే చెప్పమని పాణాలు తోడేత్తన్నాడు. ఇన్నాళ్ళకి దొరికింది" అంటూ అరుస్తోంది ముసలిది.

ముసలామె మాటలు కొంత అర్థమయ్యి, కొంత కాక ఏడుపుమాని ఆలోచనలో పడింది సుస్మిత. ఎలాగైనా సాయంత్రంలోపల ఇక్కడనుంచి బయటపడాలి! ఎలా?

"గొడవ చెయ్యకుండా కాసేపు [illegible] పడుకో! మనసు నెమ్మదిస్తది!" అన్నది వెంకటమ్మ లాలనగా. సుస్మిత నిల్చున్న చోటినుంచి కదల్లేదు.

"ఎంతసేపలా నించుంటావమ్మా, అలా కూచో. పడుకోకపోతే పోనీ, కాస్త అన్నం తిను!"

"ఉహుఁ! నేను తినను. ఆకల్తో చావనైనా ఛస్తాను గాని, యీ పాడు తిండి తినను!"

వెంకటమ్మ ఎంత బతిమాలినా సుస్మిత వినక పోవటంతో విసిగిపోయి బయటికి వెళ్ళిపోయింది.

సాయంత్రం అయిదు గంటలు కావస్తోంది అప్పటికి. సుస్మిత తప్పించుకునే మార్గం కోసం తీవ్రంగా అన్వేషిస్తోంది. గుమ్మానికి అడ్డుగా ముసల్ది కుర్చీవేసుకుని కూర్చుంది. సుస్మిత వచ్చినప్పట్నుంచీ ఆమె అక్కడే కాపలా కాస్తోంది.

చీకటి పడిపోయింది. సుస్మిత గుండెల్లో గుబులు ప్రారంభమయింది. పగలంతా ఏమీ తినకపోవటంతో బాగా నిస్త్రాణగా వుంది. కళ్ళు తిరుగుతున్నాయి.

ముసలిది లోపలికి తొంగిచూసి, "ఇంకా అలాగే ఉన్నావేం? స్నానంచేసి, గుడ్డలు మార్చుకో! ఏమే వెంకీ, దీన్నింకా తయారుజెయ్యలేదేం? ఎక్కడ సచ్చావు?" అని అరిచింది. సుస్మిత ఉలిక్కిపడింది.

ఎనిమిది గంటలయింది.

"అలాగేనమ్మా! యిప్పుడే స్నానం చేయిస్తాను" అన్నది వెంకటమ్మ. "పద పద స్నానం చేద్దువుగాని!" అంటూ రెక్కపట్టుకుని సుస్మితని లాక్కునిపోయింది.

పెరట్లో నుయ్యి వుంది. దానికిచేర్చి తలుపులేని స్నానాల గది వుంది. అక్కడ చుట్టూ పిచ్చిమొక్కలు

పెరిగిపోయి నానా భీభత్సంగా ఉంది.

వెంకటమ్మ లోపలికి తొంగి చూసింది. ముసల్ది, రెండో ఆడమనిషి బయట వీధి వరండాలో ఏదో కబుర్లు చెప్పుకుంటున్నారు.

"అమ్మా, వెంటనే ఇక్కడినుంచి పారిపో! ఇదిగో పెరటి తలుపు తీసి పెడతాను. ఏదో పనున్నట్టు నేను కూడా వీధి వరండాలోకి వెళ్తాను — ముసల్దానికి అనుమానం రాకుండా ఈలోపల పారిపో! ఇదిగో యీ పది రూపాయలుతప్ప నా దగ్గరేంలేవు, ఎందుకైనా పనికొస్తాయి తీసుకో!" తొందరచేసింది వెంకటమ్మ.

నీళ్ళు నిండిన కళ్ళతో రెండు చేతులు జోడించి, "నీ మేలు ఈ జన్మలో మరిచిపోలేను!....కాని, ఆ ముసలామె నిన్నేమైనా చేస్తుందేమో...." అన్నది సుస్మిత.

"నన్ను నరికేసినా సరే, ఆనందంగా భరిస్తాను. నీలాగే నేనూ బలవంతంగా తీసుకురాబడ్డాను. ఇప్పుడు అలవాటు పడిపోయాను. నీ జీవితం నాశనంకావటం నేను చూడలేను. వెళ్ళిపో, వెంటనే పరుగెత్తు" అంటూ వెంకటమ్మ వీధి వరండాలోకి వెళ్ళిపోయింది.

సుస్మిత ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా పెరటి తలుపు తీసుకుని బయిటికి ఉరికింది. బయట ఏముందో తెలీదు, చీకటి! అదికూడా ఓ వీధిలాగానే వుంది! తాను ఉదయం చూసిన వీధిలాంటిదే! చాలామంది ఆడవాళ్ళు బయటనించుని ఉన్నారు. మగవాళ్ళు ఎవరెవరో వస్తున్నారు, పోతున్నారు.

దారిన పోయే రిక్షాని పిలిచింది. ఎక్కి "పోనియ్యి" అన్నది. రిక్షావాడు ఎక్కడికి, యేమిటని అడగలేదు. వేగంగా తొక్కుకుంటూ ఆ వీధి దాటించేశాడు.

7

రిక్షా ముందుకి సాగిపోతోంది.

"రైల్వే స్టేషన్ కి పోనివ్వు" అన్నది రిక్షా వాడితో.

వాడు ఏం మాట్లాడలేదు. రిక్షా పోతూనే వుంది. వీధిలైట్లు అంతమయిపోయాయి. రిక్షా ఏదో నాటుదారి పట్టింది. సుస్మిత పరిసరాలు చూసి ఉలిక్కిపడింది.

"ఏయ్, రిక్షా, అబ్బాయ్, ఎక్కడికిపోతున్నావు? నేను చెప్పింది రైల్వే స్టేషన్ కి!"

"నేను తీసుకుపోతున్నది కూడా అడికే!" అన్నాడు రిక్షావాడు. నాటుసారా వాసన గుప్పుమన్నది.

సుస్మితకి ఏదో అనుమానం వచ్చింది. ఆమెకి రైల్వే స్టేషన్ కి పోయే దారి తెలియదు. కాని, అది స్టేషన్ కి దారికాదని ఆమె సిక్స్త్ సెన్స్ చెపుతోంది. అందుకు సాక్ష్యంగా ఊరివైపు దీపాలున్నవైపు రైలుకూత విని పిస్తోంది. పాగ తెరలుగా పైకిలేస్తోంది అంటే స్టేషన్ ఊళ్ళోంచే మధ్యగా వుండివుండాలి.

సుస్మిత ఆలస్యం చెయ్యలేదు. ఎదురుగా వస్తూన్న లారీ హెడ్ లైట్ల కాంతి కళ్ళమీదపడి రిక్షావాడు రిక్షా స్లో చేశాడు. ఆ క్షణాన్ని ఉపయోగించుకుంది. ఆమె చటుక్కున రిక్షాలోనించి దిగిపోయింది. వెనక్కి ఊరి వైపు పరుగులు పెట్టసాగింది.

రిక్షావాడు కొంతదూరం పోయాక రిక్షాలో ఆమె లేదని గ్రహించుకుని రిక్షా వెనక్కి తిప్పాడు. వేగంగా ఆమెను వెంబడించసాగాడు.

కాసలో ఆమె వాడికి దొరికిపోయి వుండేదే! కాని ఆమె అదృష్టమో, రిక్షావాడి ప్రారబ్ధమో తెలీదుగాని, రోడ్డుపక్కగా వేసిన రాళ్ళగుట్టమీద కెక్కేసింది రిక్షా.

రిక్షా వాడు అదుపుకు పోయి గుట్టమీదనుంచి జారి పక్కనే పారుతున్న డ్రెయినేజి కాలవలో పడిపోయాడు.

సుస్మిత వెనుతిరిగి ఏం జరిగిందో చూడాలనుకుని కూడా, ఆగితే, వాడెక్కడ పట్టుకుంటాడోనని పరుగు ఆపలేదు. ఆయాసం వస్తోంది. కళ్ళు తిరుగుతున్నాయి. కాళ్ళు తడబడుతున్నాయి. దాహంతో నాలుక పిడచ కట్టుకుపోతోంది. ఏ క్షణంలోనైనా శోషవచ్చి పడి పోయేలా వుంది. అయినా ఆమె పరుగు ఆపలేదు.

లైట్లు దగ్గరపడ్డాయి. ఊరు దగ్గరయిందని గ్రహించిందామె. పరుగు ఆపింది.

లైట్లు బాగా దగ్గరయ్యాయి. ఊరి మొదట్లోనే ఓ పాన్ షాపు కనిపించింది. ప్రాణం లేచివచ్చినట్లయింది.

"ఓ సోడా" అన్నది.

పాన్ షాపతను సోడా కొట్టించాడు. ఐస్ సోడా నీళ్ళు చల్లగా గొంతులో దిగుతుంటే అప్పటివరకు తనుపడ్డ ప్రయాస, టెన్షన్ మెల్లగా తగ్గుతూ వచ్చాయి. వరసగా మూడు సోడాలు తాగితే నేగానీ దాహం చల్లార లేదు. పాన్ షాపతను వింతగా చూస్తున్నాడామెవంక.

పదిరూపాయిల కాగితం షాపతనికిచ్చింది. అతను చిల్లర ఎంచి ఇచ్చాడు.

"రైల్వేస్టేషన్ కి దారి ఎటు?" అనడిగిందతన్ని.

"దగ్గరేనమ్మా! రిక్షా కట్టించుకుని వెళ్ళు" అన్నాడతను. ఆమె చూడగా పెద్దింటి పిల్లలా కనిపిస్తోంది. ఊరు కొత్తలా వుంది, ఒక్కతే వస్తోంది, ఎక్కడినుంచో అని ఆలోచిస్తున్నాడతను.

"రిక్షా వద్దులే! ఎటో దారి చెప్పు," అన్నది సుస్మిత.

అతనికి జాలేసింది. "ఎక్కడికి వెళ్ళాలమ్మా?"

అన్నాడు ప్రశ్నకు ప్రశ్న సమాధానమన్నట్టు."

"హైదరాబాదు."

"తొందరగా వెళ్ళమ్మా! మద్రాసునించి ఎక్స్‌ప్రెస్సు వచ్చే టైమయింది. అదిగో కుడిచేతిమీదుగా కనిపిస్తున్న రోడ్ తిన్నగా స్టేషన్‌కే పోతుంది.... ఒరే, సోములూ అమ్మాయిగార్ని రైలుస్టేషన్‌కి తీసుకెళ్ళరా!" అంటూ అటుగా వచ్చిన రిక్షావాడ్ని కేకేశాడు పాపతను.

"వద్దు, వద్దు నేను వెళ్ళగలను!" అంటూ అతను చూపించిన దారివంక చకచక అడుగులు వేసింది సుస్మిత.

రాత్రి పదకొండు గంటలయింది. రోడ్డున జన సంచారం లేదు. అయినా దారిపొడవునా మున్సిపాల్టీ వాళ్ళు అమర్చిన ట్యూబ్‌లైట్లు చక్కటి కాంతిని వెద జల్లుతున్నాయి. స్టేషన్ దగ్గరపడుతున్న సూచనలు దూరం నించే కనిపించాయామెకు. ట్రెయిన్ కూత, షంటింగ్ చేస్తున్న శబ్దం—అన్నీ దగ్గరయ్యాయి.

చకచక స్టేషన్ మెట్లెక్కింది. ఏదో ట్రెయిన్ స్టేషన్‌లో సిద్ధంగా వుంది. లోపలికి వేగంగా అడుగులు వేసింది. బుకింగ్ రూం దగ్గర్నుంచి వెళ్తూ గతుక్కు మంది. తన దగ్గర టికెట్‌కి సరిపడ డబ్బులేవు. కనీసం మూఫైరూపాయలకు తక్కువుండదేమో ఛార్జీ. కాని తన దగ్గర తొమ్మిది రూపాయల పావలా వుంది.

ట్రెయిన్ కూతలో ఆమె ఆలోచనలు చెదిరిపోయాయి. సరే, టి.సి. పట్టుకుంటే యేదో చెప్పుకోవచ్చునన్న తెగింపు వచ్చేసిందామెకు. ప్లాట్‌ఫామ్‌మీదకు చేరుకుంది. అక్కడెవరో వుంటే అడిగింది.

"ఏమండీ, ఇది మద్రాసునుంచేనా వస్తున్నది?" అని.

"అవును!" అన్నాడతను ముక్తసరిగా.

అప్పటికే ట్రెయిన్ మూవ్ అయింది. సుస్మిత చటుక్కున దొరికిన కంపార్టుమెంటు ఎక్కేసింది. అది జనరల్ కంపార్టుమెంటు. అంతమంది జనాన్ని తోసుకుని లోపలికెలా వెళ్ళాలో ఆమెకి తోచలేదు. ఆడపిల్లని ఎవరూ జాలిపడి చోటివ్వలేదు సరికదా, మరికాస్త ధీటుగా నించున్నారు తలుపు దగ్గర. అలాగే దారిచేసుకుని లోపలికి జొరబడింది.

ట్రెయిన్ స్పీడు అందుకుంది. మెల్లిగా దారిచేసుకుని సీట్లున్నవేమోనని వెతుక్కుంది. ఎక్కడా ఖాళీ దొరకలేదు. ఒక ముసలాయన కాస్త జరిగి చోటిచ్చాడు, "కూచోమ్మా!" అన్నాడు. తన మనవరాలు గుర్తొచ్చిందేమో! ఆయనకి కృతజ్ఞతలు చెప్పుకుని కూచుంది. అంతమంది జనాన్ని చూశాక ఆమెలో భయం, బెరుకుపోయి ఆ స్థానాన్నే ధైర్యం చోటుచేసుకుంది.

రిలాక్సింగ్‌గా కూచుని వెనక్కి జారగిలబడింది. అంతసేపు తనుపడ్డ ప్రయాస మర్చిపోయింది.

ట్రెయిన్ కుదుపుకి నిద్రదేవత తనంతట తానుగా వచ్చి ఆమెను ఆవరించింది. ఎంత ఆపుకోవాలన్నా ఆమెకు సాధ్యపడలేదు. అలాగే కూచుని కళ్ళుమూసుకుంది.

8

టి. సి. తట్టిలేపటంతో చటుక్కున కళ్ళు తెరిచింది సుస్మిత. కాసేపటివరకు తనెక్కడున్నదో ఆమెకు అర్థం చేసుకోవటానికి రెండు నిమిషాలు పట్టింది.

"టికెట్, టికెట్" అంటున్నాడు టి. సి.

సుస్మిత గుండెల్లో రాయిపడింది. అతనికేమని సమాధానం చెప్పాలి?

"టికెట్ యేదమ్మా!" అంటున్నాడాయన.

సుస్మిత గుటకలు మింగి, "ట్రెయిన్ కదిలిపోతుంటె హడావిడిగా ఎక్కేశానండి. టికెట్ తీసుకోలేదండి!" అన్నది.

టి. సి.కి ఆమె నిజమే చెప్తున్నదనిపించింది. చూడగా టికెట్ లెస్ ట్రావెలర్‌లా కనిపించటంలేదు.

బిల్ బుక్ పైకి తీసి "సరే, టికెట్ నేను చించుతాను ఎక్కడ ఎక్కావు?" అన్నాడు టి.సి.

"ఒంగోలు."

"ఎక్కడికి పోవాలి?"

"హైదరాబాదు."

టి.సి. విచిత్రంగా చూశాడు. "ఏమమ్మా, నిద్ర మత్తులో వున్నావా, లేక నాతో వేళాకోళ మాడుతున్నావా?" అన్నాడు సీరియస్‌గా.

"అయ్యయ్యో, నిజంగానే హైద్రాబాద్ వెళ్ళాలి అంకుల్!" అన్నది సుస్మిత.

"ఇది హౌరా పోయే ట్రెయిన్, హైద్రాబాదు పోదు. చదువుకున్న పిల్లలా వున్నావు, ఆమాత్రం తెలీదా?" అన్నాడు ఆయన అదే సీరియస్‌నెస్‌తో.

"నిజంగా నాకు తెలీదు అంకుల్. ఎవరో అడిగితే ఇదేనన్నారు, ఎక్కేశాను" అన్నది చుట్టూ భయంగా చూస్తూ. ఆమెకి ఏడుపొచ్చినంత పనయ్యింది. హైద్రాబాదు వెళ్ళిపోతే ఎలాగైనా ఇక ఫరవాలేదనుకుంటుంటే ఇప్పుడు అసలు రూటే మారిపోయింది. భగవాన్ యిప్పుడెలా?

"సరే, వచ్చే ఏలూరు స్టేషన్‌లో దిగిపో! ఇక్కడి వరకు ఛార్జ్ ఇరవై రెండు రూపాయలు-ఇదిగో టికెట్!" అన్నాడు బిల్ బుక్ నించి ఎర్ర కాగితంనించి ఆమెకిస్తూ.

"సారీ, అంకుల్! నా దగ్గర పైసల్లేవు!" అన్నది బిక్కమొహం వేసుకుని సుస్మిత.

టి.సి.కీసారి చాలా కోపం వచ్చేసింది.

"ఏమిటీ నాటకం? నువ్వు కావాలనే ఈ ట్రెయిన్ ఎక్కావు. మళ్ళీ హైదరాబాద్ పోవాలని అబద్ధమాడుతున్నావు. మధ్యలో దించేస్తే హాయిగా దిగిపోయి, మరో ట్రెయిన్ ఎక్కి నీ ప్రయాణం పొడిగించాలని ప్లాన్ వేశావు. నీ చదువు ఇలాంటి వక్రమార్గాలు పట్టడానికి ఉపయోగించేబదులు, బుద్ధి తెచ్చుకో!" అంటున్నాడు.

అంతదాకా దాదాపు అందరూ నిద్రావస్థలో వున్నారు. టి.సి. లేపటంతో లేచి టికెట్ చూపించి మళ్ళీ నిద్రకొరిగిపోతున్నారు. టి.సి. కేకలకు చాలామంది నిద్రాభంగమై లేచి చూస్తున్నారు.

సుస్మితకు ఏడుపు తన్నుకుంటూ వచ్చేసింది. అందరూ తనని ఓ దొంగలా, ఘోరమైన తప్పుచేసినదానిలా చూస్తుంటే ఆమెకు అవమానంతో ఒళ్ళు చచ్చిపోయింది.

"పోనీండి పాపం, డబ్బుల్లేవేమో!" అని జాలిపడ్డారు ఒకరిద్దరు. అది ఇంకా అవమానకరమనిపించింది సుస్మితకు. ఆ ట్రెయిన్‌లోనుంచి దూకి చచ్చిపోదామన్నంత బాధగా తోచాయి ఆ మాటలు. అయినా సహించింది.

"ట్రెయిన్ ఆగుతోంది. రైల్వేపోలీసులకప్పచెప్పాల్సి వుంటుంది. అన్నీ దొంగవేషాలు!" నిర్దయంగా అంటున్న టి.సి. మాటలు ఆమె హృదయాన్ని తూట్లు పొడిచాయి.

9

"నీ పేరు సుస్మితేనా?" ఇన్‌స్పెక్టర్‌లా వున్నతను అడిగాడామెను. అసంకల్పితంగా తలూపింది. అతను

తన చేతిలో వున్న ఫోటోను, సుస్మితను మార్చి మార్చి చూశాడు.

"ఏంటి ఇన్‌స్పెక్టరు!" అన్నాడు టి.సి. ఆత్రుతగా.

"అబ్బే మరేంలేదు సార్, ఈ అమ్మాయి తప్పిపోయినట్టు వీళ్ళ మామయ్య పల్లంరాజుగారు పోలీసు రిపోర్టు ఇచ్చారు. పోలీస్టేషన్లన్నిటితోబాటు రైల్వే పోలీస్‌లకి, బస్ స్టేషన్లకు మెసేజ్ వెళ్ళింది. ఇదిగో ఈ అమ్మాయి ఫోటోలు కూడా అన్ని స్టేషన్లకీ పంపించారు. ఈ ఫోటో సాయంతోనే ఈ అమ్మాయిని గుర్తించాం" అని చెప్పాడు ఆ రైల్వే పోలీస్ ఇన్‌స్పెక్టరు.

సుస్మితకి అర్థమైపోయింది. తన మామయ్య తను తప్పించుకు పోగానే ఏం ఎరగనట్టు పోలీసురిపోర్టిచ్చాడన్నమాట! తనమీదికి రాకుండా ముందుగానే జాగ్రత్త పడ్డాడు — అమ్మని కూడా ఈ రిపోర్టుతో నమ్మించి వుంటాడు.

"ఎక్కడినుంచి వస్తున్నావమ్మా, ఎలా తప్పిపోయావు?" అడిగాడు ఇన్‌స్పెక్టరు.

ఒంగోలులోని ముసల్ది చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. పోలీసులు తమకు కావలసినవాళ్ళేనంటూ వ్యాఖ్యానించటం గుర్తొచ్చింది. తను విజయవాడ ముసలామెమీద, ఒంగోలు ముసలామెమీద రిపోర్టిచ్చినా పోలీసులు వాళ్ళమీద చర్య తీసుకుంటారనే గ్యారంటీ ఏముంది? తను చెప్పాల్సిన సమయం ఇదికాదు, సరైన టైం చూసుకుని చెప్పాలి. అప్పుడు వాళ్ళు మళ్ళీ తప్పించుకోలేని విధంగా పట్టించాలి!

"రామ్మా, మాతో!" అన్నాడు రైల్వే ఇన్‌స్పెక్టరు.

సుస్మిత వాళ్ళతోబాటు నడిచింది. రైల్వేస్టేషన్

ఆవరణలోనే వున్న తమ స్టేషన్‌కి తీసుకువెళ్ళా రామెని.

ఇన్‌స్పెక్టరు మళ్ళీ రెట్టించి అడిగినా, సుస్మిత పెదవి విప్పలేదు. తన ప్రమేయం లేకుండానే పరిస్థితులు చకచక మారిపోవటం ఆమెలో జడత్వాన్ని తెచ్చాయి.

ఇన్‌స్పెక్టరు ఆమెని ఏమడిగినా లాభంలేదని నిర్ణయించుకున్నాడేమో యెవరికో ఫోన్ చేసి తను దొరికినట్టు ఇన్ఫర్మేషనిచ్చాడు.

ఓ పదినిమిషాల తర్వాత మరో పోలీసు ఇన్‌స్పెక్టరు ఇద్దరు కాన్‌స్టేబుల్స్‌తో వచ్చాడు. రైల్వే పోలీసువాళ్లు తనని జనరల్ పోలీసువాళ్ళకి అప్పచెప్పబోతున్నారని గ్రహించింది సుస్మిత.

"రామ్మా, మాతో! మీ మామయ్యగారికి విజయవాడ కబురుచేశాం. ఆయన మా పోలీస్‌స్టేషన్‌కొస్తారు. సువ్వెక్కడో తప్పిపోయావని కంప్లయింట్ యిచ్చారు. ఎక్కడికిపోయావు, ఇక్కడికెలా వచ్చావు?" అనడిగాడు ఆ సబ్‌ఇన్‌స్పెక్టరు. సుస్మిత పెదవి విప్పలేదు. అతను కళ్ళతోనే రైల్వే ఇన్‌స్పెక్టరుతో ఏదో మాట్లాడుతున్నాడు.

సుస్మిత ఇది గమనించింది. పోలీసు స్టేషన్‌లో స్త్రీలకు జరిగిన అత్యాచారాల గురించి ఆమె పేపర్లో చదివింది, విన్నది. తను ఏదియేమయినా వీళ్ళవెంట పోకూడదని నిర్ణయించుకుంది.

"రామ్మా, వెళ్దాం!" అన్నాడు ఎస్.ఐ. మళ్ళీ.

"నేను రాను. మీరు మా మామయ్యను పిలిపించదల్చుకుంటే ఇక్కడికే పిలవండి!" అన్నది సుస్మిత ఒక నిర్ణయానికి వస్తూ.

ఎస్.ఐ. రైల్వే ఇన్‌స్పెక్టరు దెబ్బతిన్నట్టు చూశారు.

ఆమె అంతర్యం యేమిటో చూచాయగా వాళ్ళకర్థమైంది.

ఎస్.ఐ. ముఖం మాడ్చుకుని, "ఆల్ రైట్! ఇక్కడికే పంపిస్తాం. మా దేంపోయింది?" అంటూ అక్కడినుంచి విసురుగా వెళ్ళిపోయాడు.

మరో గంటన్నర తర్వాత పల్లంరాజు పరుగెత్తుకుంటూ వచ్చాడు. సుస్మితకి అతన్ని చూడగానే ప్రతీకార వాంఛతో భగ్గున మండింది.

అతను వస్తూనే కొండంత ఆప్యాయతను వెదజల్లుతూ "అమ్మా సుస్మీ, యెక్కడికి వెళ్ళిపోయావమ్మా, నువ్వేమయిపోయావోనని మీ అమ్మ ఒకటే గొడవ! ఏడుస్తూ కూచుంది. నేను రాత్రే హైదరాబాదునుంచి వచ్చాను. మీ అమ్మని నాతో బెజవాడ రమ్మంటే రాలేదు. ఈ రోజు ఎంత సుదినం!" అన్నాడు.

సుస్మిత ముఖంలో ఎలాంటి భావాలనీ కనపరచలేదు. మౌనంగా అతని వెంట బయలు దేరింది.

స్టేషన్ బయట నిలబెట్టిన కారులో సుస్మితని కూర్చోబెట్టాడు. తను పక్కనే కూచుని, "డ్రైవర్ పోనియ్యి" అన్నాడు. కారు కదిలింది.

"మెసేజ్ వినగానే విజయవాడనుంచే కారేసుకుని ఆఘమేఘాలమధ్య వచ్చేశాను...." అంటూ చెప్పుకొస్తున్నాడు పల్లంరాజు.

సుస్మిత ఆ మాటలు వినటంలేదు. తిరిగి తిరిగి మళ్ళీ పులి బోనులో చిక్కుకున్నందుకు ఆమె మనసు నలిగిపోతోంది.

ఆలోచనల మధ్య కారు విజయవాడ ఎప్పుడు చేరుకుందో, సుస్మిత గమనించలేదు. చిన్న జర్కుతో కారాగింది.

సుస్మిత బయటికి చూసింది. మామయ్య ఇల్లు! మళ్ళీ తనకి బందిఖానా తప్పదా?

"దిగమ్మా, లోపలికి వెళ్దాం!" అన్నాడు పల్లంరాజు.

మౌనంగా అతన్ననుసరించింది. పక్కకు చూసింది. ఆ పక్కవీధిలోనే తనను ఖాసించేత వేశ్యాగృహానికి అమ్మించిన ముసలిది వుంటున్న ఇల్లుంది. ఆ ఇల్లు తనకి గుర్తే. ఒంగోలు ముసలిదాని ఇల్లుకూడా మరిచిపోలేదు. వీళ్ళిద్దరికి జన్మలో మరిచిపోలేని శిక్షవిధించేలా చూడాలి! తను వీళ్ళనంత తేలిగ్గా వదలదు.

సుస్మితలో ప్రతీకారవాంఛ ప్రజ్వరిల్లుతోంది.

లోపల తనని వెంబడించిన పనివాడిని, ఇద్దరు ఆడ వాళ్ళని చూసింది సుస్మిత. మీ సంగతి చూస్తాను అను కున్నది మనసులోనే.

మామయ్యతో లోపలి గదిలోనికి మౌనంగా నడిచింది.

లోపలికి రాగానే తలుపులు మూసి, పల్లంరాజు తన విశ్వరూపాన్ని చూపించాడు. ఆమె చెంపలు రెండూ వాయించాడు. సుస్మిత కళ్ళు తిరిగి పడిపోబోయింది.

"ఏమే, నాకే మస్కాకొట్టి పారిపోతావా? నిన్ను పట్టుకోలేనంత అసమర్థుడిననుకున్నావా, నా దృష్టినుంచి తప్పించుకు పారిపోవటం నీ తరమా, నీ బాబు తరమా?" నోటికొచ్చినట్టు వాగుతున్నాడు పల్లంరాజు.

సుస్మిత అప్పటికప్పుడే ఓ నిర్ణయానికొచ్చేసింది.

"క్షమించు మామయ్యా, నువ్వు చెప్పినట్టే వింటాను. చెయ్యమన్నట్టు చేస్తాను" అన్నది అవమానాన్ని ఉక్రోషాన్ని పళ్ళ బిగువున దాచుకుని.

"అలా దారికిరా! అయినా నిన్ను నమ్మపనిలేదు.

నువ్వు ఆ గదిలోనే పడుండు. నువ్వింకా మేజర్ కావ టానికి రెండు నెలల టైముంది....” అని అంతలోనే మాట మార్చేసి, “అదే రెండు నెలల్లో నీ పెళ్ళి!” అన్నాడు.

సుస్మిత ఆశ్చర్యాన్ని బయటికి ప్రకటించకుండా నిగ్ర హించుకుంది. అంటే రెండు నెలల్లో తనకి పద్దెనిమిదేళ్లు నిండుతున్నాయి. దానికీ తనను మామయ్య బంధించటానికి యేదో బలమైన కారణముందన్నమాట! యేమిటది?

పల్లంరాజు బయటికి వెళ్ళాడు. సుస్మితని మళ్ళీ అదే బందిఖానాలోకి మార్చటానికి యేర్పాట్లు జరిగాయి.

10

సుస్మిత మౌనంగా స్నానాదులు చేసింది. తన కార్య క్రమాన్ని అమలు చెయ్యటానికి ఆకలితో బాధపడ కూడదు. మామయ్య అంతు తేల్చటానికి అతనింట్లోనే కార్యక్రమాన్ని మొదలు పెట్టాలి!

“గుడ్, అలా బుద్ధిమంతురాలిలా వుండాలి నా కోడలు” అని ముచ్చటపడిపోయాడు పల్లంరాజు.

సుస్మిత నవ్వింది. “మామయ్యా, సూరిబావ కనిపించ టంలేదేమిటి?” అన్నది.

“ఇక్కడే వున్నాడమ్మా. రాత్రి నాతో మీ ఇంటి దగ్గర్నుంచి తీసుకొచ్చాను. వాడు నీమీద చాలా బెంగ పెట్టుకున్నాడమ్మా!” అన్నాడు పల్లంరాజు.

ఓ పదినిమిషాల తర్వాత సూరి అక్కడికొచ్చాడు. “సుసీ, యెప్పుడొచ్చావు? నువ్వేమయిపోయావోనని భయ పడిపోయాం, తెల్సా!” అంటూ.

“బావా, అమ్మ ఎలా వుంది?” అన్నది సుస్మిత ముందుగా తల్లిని గురించి తెల్సుకోవాలనే ఆరాటంతో.

"నీ గురించి బెంగ పెట్టుకుంది. అసలు నిన్నెవరో ఎత్తుకుపోయారంటగదా!"

"ఎవరన్నారు?"

"మా నాన్న మీ అమ్మతో చెప్పాడు. అమ్మ పోలీసు రిపోర్టు ఇస్తానంటే నాన్న తనే రిపోర్టిచ్చాడు నిన్న. కారుందిగా అస్తమాను హైద్రాబాదూ విజయవాడ తిరుగుతున్నాడు."

"మామయ్య ఎక్కడున్నాడు?"

"హైద్రాబాద్ పోతున్నాడుగా."

"ఎప్పుడు?"

"ఇంకో గంటలో."

సుస్మిత టైం చూసుకుంది. రాత్రి యేడు కావచ్చింది. ఇప్పుడు ఎందుకు వెళ్తున్నట్టు మామయ్య? ఆమె మనసు పరిపరివిధాలా ఆలోచిస్తోంది. ఈ రాత్రే తను యీ బందిఖానానించి బయటపడాలి.

"సుసీ, మన పెళ్ళంటగా!" అన్నాడు సూరి.

"ఎవరు చెప్పారు?"

"మా నాన్న."

"మా అమ్మకి తెలుసా?"

"ఏమో మరి!"

"నన్నెందుకు చేసుకోవాలనుకుంటున్నావు నువ్వు? మాకన్నా మీరే బాగా డబ్బున్నవాళ్ళు కదా? పెద్ద కట్నంతో పెళ్ళాం దొరుకుతుందికదా నీకు!"

"అబ్బ, అబ్బా! నువ్వే అందరికన్నా డబ్బున్నదానివి! నీకు తాతయ్య ఎన్నో లక్షల రూపాయలు రాసిచ్చాడటగదా! రెండు నెల్లలో ఆ డబ్బు నీకొస్తుందటగదా. నిన్ను పెళ్ళిచేసుకుంటే అదంతా నాదే కదా!"

సుస్మితకి మబ్బు తెర విడిపోయింది. అసలు కారణం అర్థమయింది. ఇదా మామయ్య పన్నాగం? తాతయ్య తనకి ఆస్తి మేజరయ్యాక ముట్టేటట్టు ఏదైనా వీలునామా రాసివుండాలి? బహుశా అది, మామయ్య చేతికి చిక్కి వుంటుంది. తండ్రి పోయాక ఆస్తిపాస్తుల వ్యవహారాలు చూసే నెపంతో తమ ఇంట్లో తిష్ట వేసుకుని మామయ్య చేసిన నిర్వాకం ఏమిటో ఆమెకి బాగా తెలిసి వచ్చింది. ఆమె ఏదో అడగబోయింది.

ఇంతలో పల్లంరాజు లోపలికొచ్చాడు. వాళ్ళిద్దర్నీ అక్కడ పక్కపక్కన చూసి మురిసిపోతూ, ఏదో చెప్పాలని వచ్చినవాడు అల్లాగే వెనక్కి వెళ్ళిపోయాడు. మామయ్య ప్రయాణానికి సిద్ధమయ్యాడని అర్థం చేసుకుందామె. బయట ఎవరితోనో తనని జాగ్రత్తగా కనిపెట్టుకుని వుండమని జాగ్రత్తలు చెపుతున్నాడు మామయ్య.

"చూడు నూరీ, ఆ ఆస్తి తాలూకు వివరాలు నీకు తెలుసా?" అన్నది లాలనగా సుస్మిత, బయట కారు చప్పుడు దూరం కాగానే.

"నాకు తెలీకపోవటమేమిటి? అవన్నీ బీరువాలో దాచాడు నాన్న!"

"అలాగా, నేనెప్పుడూ చూడనేలేదు."

"నేను చూపించనా?"

"నీ దగ్గర తాళాలు లేవుగా!"

"నాన్న ఊరెళ్ళేటప్పుడు తాళాలు తీసుకుపోడుగా. అవెక్కడ దాస్తాడో నాకు తెలుసుగా!"

"నీకు తెలుసా? అయితే చూపించమ్మా!"

"ఉందు. ఆ పనిమనుషులు నిద్రపోనియ్యి. నాన్న లేనపుడు వేటకుక్కల్లా కాపలా కాస్తుంటారు వాళ్ళు."

"సరే, గమ్మున తీసుకురా!" అన్నది సుస్మిత.

రాత్రి పదిగంటలు కావచ్చింది.

సుస్మిత గదిలో అసహనంగా పచార్లు చేస్తోంది. పని వాళ్ళిద్దరు గదిముందే కాపలా కాస్తున్నారు. వాళ్ళు ఆ రాత్రి తమ పక్కలు సుస్మిత గది ముందుకే మార్చుకున్నారు.

నూరి వచ్చాడు. దస్తావేజుల కట్టలు తెచ్చాడు.

అవన్నీ చూసి సుస్మిత విస్తుపోయింది. తలుపులు చేరవేసింది. బయట పనివాళ్ళకు తెలిస్తే కథ తారుమారు అయిపోతుందని ఆమెకు తెలుసు.

అవన్నీ వడ్డీలకి అప్పులిచ్చి భూముల్ని, ఇళ్ళని పల్లం రాజు తన పేర రాయించుకున్న దస్తావేజులు! తన మామయ్య విశ్వరూపం బోధపడసాగిందామెకు.

అందులో తనక్కావలసిన దస్తావేజు దొరికింది. తనని గుండెలమీద ఎక్కించుకుని గుఱ్ఱం ఆటలు ఆడిన తాతయ్య రాసిన వీలునామా అది! తనకు పద్ధెనిమిదేళ్ళు నిండేసరికి ఆస్తి అంతా తనకు చెందేలాగున రాశాడు.

"నూరీ, నేనంటే నీకిష్టమే కదా!" అన్నది సుస్మిత సూటిగా.

"ఓ బోలెడంత."

"అయితే, నాకు అమ్మని చూడాలని వుంది, తీసుకువెళ్తావా?"

"తప్పకుండా. మరి ఇందాకా చెపితే నాన్నతో కార్లో వెళ్ళేదానివి కదా!"

అతని అమాయకత్వానికి నవ్వొచ్చింది.

"ట్రెయిన్ కెళ్దామా, బస్‌కా!"

"ట్రెయిన్‌కే వెళ్దాం."

"ఇంకో గంటలో గోదావరి ఎక్స్‌ప్రెస్ వుంది. పోదామా?"

"మరి ఈ కాపలావాళ్ళ సంగతి?"

"సెకండ్ షోకి తీసుకెళ్తున్నానని చెపుతాను. నన్నెవరూ కాదనరు కదా!"

వెర్రివాడికి కూడా తెలివి వుంటుందని మొదటిసారిగా గ్రహించింది సుస్మిత.

మరోగంట తర్వాత వాళ్ళిద్దరు హైదరాబాద్ పోయే గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో వున్నారు. తనవెంట తాతయ్య వీలునామాతోబాటు, మామయ్యని కటకటాల వెనక్కు పంపించటానికి దోహదం చేసే డాక్యుమెంట్సన్నీ తెచ్చుకోవటం మరిచిపోలేదు సుస్మిత.

మర్నాడుదయం ట్రెయిన్ సికింద్రాబాద్ చేరగానే బావతో సరాసరి కమిషనర్ ఆఫ్ పోలీసు ఇంటికి టాక్సీ వేసుకుని వెళ్ళింది సుస్మిత.

ఆమె రిపోర్టులన్నీ రికార్డయ్యాయి. విజయవాడ ఒంగోలు మునసామెల సంగతితో పాటు అన్ని సంగతులు రికార్డయిపోయాయి.

తనమీది ఆశతో తనకు అన్నివిధాలా సాయపడిన వెర్రిబాగుల బావవంక జాలిగా చూసింది సుస్మిత.

టాక్సీ సుస్మిత ఇంటివైపు దూసుకుపోయింది.

—:అయిపోయింది:—